క్లుప్తంగా

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం



పెద్దకొత్తపల్లి: ప్రభుత్వం డిసెంబర్ 28 నుంచి ఈ నెల 6 వరకు ఆరు గ్యారంటీల పథకం కోసం గ్రామాల్లో అధికారులు స్వీకరించిన దరఖాస్తులను కంప్యూటర్ ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను ఆదివారం ప్రారంభించినట్లు డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో మొత్తం 23716 దరఖాస్తులు అందాయని తెలిపారు. 10 మంది ఆపరేటర్లు వివరాలు నమోదు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, డీఓఆర్‌డీ లక్ష్మణ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం ఓఎస్‌డీని కలిసిన శ్రీనిధి ఉద్యోగులు



కందనూలు: సీఎం ఓఎస్‌డీ అజిత్‌రెడ్డిని ఆదివారం శ్రీనిధి ఎంప్లాయ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనిధి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కోసం శ్రీనిధి సంస్థలో ఉద్యోగులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తక్కువ వేతనంతో పని చేస్తున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంస్థలో పనిచేసే సిబ్బందికి పే స్కేల్ అమలు, క్యాడర్ ఫిక్సేషన్, సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు పరిశీలించాలని కోరారు.

బస్సు ప్రాంగణాలు మహిళలతో కిటకిట



పెద్దకొత్తపల్లి: ఆరు గ్యారంటీ పథకంలో అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే రెండ పథకాలను అమలుచేస్తోంది. అందులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్టాండ్‌లు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. పట్టణాలకు, గ్రామాలకు వెళ్లే బస్సులతో మహిళల రద్దీ కనిపించింది. మండల కేంద్రంలో బస్టాండ్ ప్రాంగణం ప్రతి నిత్యం మహిళా ప్రయాణికులతో కళకళలాడుతోంది.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కల్వకుర్తిరూరల్: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని జిల్లెల్లలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు వెంకటయ్యగౌడ్ సంబంధించిన గేదెలు తన వ్యవసాయం పొలంలో గడ్డి మేస్తున్నాయి. పక్కనే ఉన ట్రాన్స్‌ఫార్మర్‌కు గేదె తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. దీని విలువ దాదాపు రూ.50 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

ఎన్నికల కమిటీలో వంశీకి చోటు కల్పనపై హర్షం

కల్వకుర్తిరూరల్: మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచందర్‌రెడ్డికి రాష్ట్ర పార్లమెంట్ ఎన్నికల కమిటీలో దక్కడంతో మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితి ఆశదీప్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే వంశీచందర్ రెడ్డికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని కోరారు.

దుబ్బతండా వాసికి డాక్టరేట్

వెల్దండ: మండలంలోని దుబ్బతండాకు చెందిన జరుప్ల జ్యోతికి జేఎన్‌టీయూలో హెచ్ యూనివర్సిటీ అనంతపురం జిల్లా నుంచి ఎలక్ట్రానిక్స్‌లో కమ్యూనికేషన్స్ ఇంజినీయర్ డాక్టరేట్ పట్టా సాధించింది. దీంతో గ్రామస్తులు డాక్టర్ శివరాంనాయక్‌తో పాటు తండా వాసులు ఆమెను అభినందించారు.



బస్టాండ్ ప్రారంభమయ్యేనా?

మన్ననూర్: ప్రయాణికుల సౌకర్యార్థం స్థానికంగా బస్టాండ్‌ను నూతనంగా నిర్మించారు. కాని ప్రారంభానికి నోచుకోకపోవడం ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి అమ్రాబాద్ మండలం నుంచి ఇతర ప్రాంతాలకు ఇక్కడి నుంచి రాకపోకలు కొనసాగిస్తారు. ప్రతి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు హైదరాబాద్, మహబూబ్‌నగర్, శ్రీశైలం తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. ప్రత్యేకించి ఉమ్మడి అమ్రాబాద్ మండంలోని సుమారు 40 వేల మంది తరుచుగా ప్రయాణాలు చేస్తారని అధికారులు పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం 18 ఏళ్ల కిందట అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం మన్ననూర్‌కు బస్టాండ్ మంజూరు చేసింది. నిధులు కేటాయించి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఎట్టకేలకు పనులు బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కాని ప్రారంభానికి నోచుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపైనే బస్సుల కోసం నిలబడి ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బస్టాండ్ ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మన్ననూర్‌లో నూతనంగా నిర్మించిన బస్టాండ్

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

వివిధ పనులు కోసం మండల కేంద్రం అయిన అమ్రాబాద్‌కు తరుచుగా వెళ్తుంటాం. మండలానికి వెళ్లేందుకు రెండు బస్సులు మారాలి. మన్ననూరులో బస్సు దిగి మండల కేంద్రానికి వెళ్లాలి. మన్ననూరులో బస్టాండ్ లేకపోవడంతో బస్సుల కోసం నిలబడేందుకు కూడా స్థలం లేదు. హోటళ్ల ఎదుట నిలబడితే యజమానులు తిడుతున్నారు.

–నారాయణ, సార్లపల్లి

కోతుల బెడద ఎక్కువైంది

మన్ననూరులో బస్సుల కోసం వేచిచూస్తుంటే చేతిలో ఉన్న బ్యాగులను కూడా కోతులు ఎత్తుకెళ్తున్నాయి. కొంచెం ఆదమరిచినా వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోతులు ప్రయాణికులపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. కొత్తగా నిర్మించిన బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

– శాంతమ్మ, ఆమనగల్లు

అయోధ్య అక్షతల ఊరేగింపు



కల్వకుర్తి మండలం పంజుగులలో అక్షతలు పంపిణీ చేస్తున్న నాయకులు



తెలకపల్లిలో

కల్వకుర్తిరూరల్: మండలంలోని సుద్దకల్, పంజుగుల గ్రామాల్లో ఇంటింటికి అయోధ్య అక్షతల పంపిణీ చేశారు. ఆయా గ్రామాలలోని దేవాలయాల వద్ద పూజలు నిర్వహించి అక్షతలు ఊరేగింపుగా వెళ్లి ఇంటింటికి అయోధ్య అక్షతలు, రామ మందిరం చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో పంజుగులలో నిరంజన్, బాలగౌడ్, దారమోని గణేష్, రమేష్‌గౌడ్, శివశంకర్, సుద్దకల్ గ్రామంలో రాంరెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో ఆదివారం అయోధ్య అక్షతల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటింట అయోధ్య అక్షతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింహ్మ,



వెల్దండ మండలం చెర్కూర్‌లో

నాయకులు రాజశేఖర్, భీమయ్యగౌడ్, రామచంద్రయ్య, రమేష్‌ముదిరాజ్, లాలయ్యముదిరాజ్ తదితరులు ఉన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షతలను ఆదివారం ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ నామస్మరణ మార్మోగింది. గ్రామస్తులకు మంగళ హారతులతో అక్షతలకు స్వాగతం పలికారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



వెల్దండ: హైదరాబాదులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండలంలోని వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నియోజకవర్గ కిసాన్‌సెల్ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, మాజీ ఎంపీపీ రాజశేఖర్, ఈదన్నగౌడ్, బుచ్చయ్యగౌడ్, సత్యనారాయణ, భీమయ్య, ఆంజనేయులు ఉన్నారు.

డైరెక్టర్‌కు సన్మానం



తెలకపల్లి: మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల జిల్లా డైరెక్టర్ బొమ్మసాని సత్యనారాయణను ఆ సంఘం సభ్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఇటీవల ఎన్నికైన మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణను ఆదివారం మండల కేంద్రంలో సన్మానించారు. సంఘం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొమ్మసాని నర్సింహా, సంఘం డైరెక్టర్లు రవి, శివ, కిష్టమ్మ, రమేష్, సాయిరాం, ఈశ్వర్, సత్యనారాయణ, భాస్కర్, శివలక్ష్మణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వీరశైవ లింగాయత్, బలిజ సంఘం ఎన్నిక

కందనూలు: జిల్లా కేంద్రంలో వీరశైవ లింగాయత్, బలిజ నూతన జిల్లా కమిటీలను ఆదివారం సంఘం భవనంలో ఏర్పాటుచేశారు. వీరశైవ లింగాయత్ సంఘం ఉమ్మడి మహబుబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జ్ కొండవీరన్న సమక్షంలో జిల్లా స్థాయి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సురేష్, అధ్యక్షుడిగా గిరిజా శంకర్, ప్రధాన కార్యదర్శి రాజేష్ కుమార్, కోశాధికారిగా రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా శివశంకర్, సాంబశివుడు, కే మల్లేష్, సిద్దయ్య, శంకరయ్య, సంయుక్త కార్యదర్శులుగా ఆనందకుమార్, శెట్టి రాజేష్, భద్రయ్య, విశ్వనాథంతో పాటు సలహాదారులను, తదితరులను ఎన్నుకున్నారు.

నేడు దేవనాథ జీయర్ స్వామి రాక

అచ్చంపేట రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయానికి రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా సోమవారం పట్టణానికి దేవనాథ జీయర్ స్వామి రానున్నారని వికాస తరంగిణి సభ్యుడు గోపాల్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయంలో ధార్మిక చైతన్య మహాసభను నిర్వహించనున్నామని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి

కందనూలు: ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సెక్రెటరీ అన్నారు. ఆదివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జ్ఞానేశ్వర వాత్సల్య మందిర్‌లో ఆశ్రమ చిన్నారులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. రెడ్ క్రాస్ సేవలు అభినందనీయమన్నారు. చిన్నారులు మరింత బాధ్యతతో ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అంతకు ముందు రెడ్ క్రాస్ సభ్యుడు కృష్ణ రావు తండ్రి స్వర్గీయ జగపతి రావు జ్ఞాపకార్థం బాలికల ఆశ్రమంలో ఇన్వర్టర్‌ను రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఆశ్రమ నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో ట్రెజరర్ రాధాకృష్ణ, యూత్ రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ డి కుమార్, రెడ్ క్రాస్ సభ్యులు రాజవర్ధన్ రెడ్డి, శేఖర్, ఆశ్రమ నిర్వాహకులు ఆకారపు విశ్వనాథం, ఇందుమతి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

ఘనంగా అయ్యప్ప పడిపూజ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం గురుస్వామి మండికారి బాలాజీ ఆధ్వర్యంలో పడిపూజను ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర, లలితాంబిక, కుమార స్వామి పూజలు నిర్వహించి అనంతరం అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. పద్దెనిమిది మెట్లపై కర్పూరం వెలిగించారు. శరణు ఘోష, భక్తి గీతాలతో మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వాములు రమేష్, జాహంగీర్, రఘురాం, ఆంజనేయులు, నవీన్, వంశీ, ధన్‌రాజు, అంజనీమాత సేవాసమితి సభ్యురాలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అచ్చంపేట రూరల్: ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ప్రైవేటు ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజ నిర్మాణంలో ప్రైవేట్ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రేణయ్య, ఉపాధ్యక్షుడిగా రాజు, నరసింహ, కోశాధికారిగా శ్రీను, కార్యదర్శిగా కురుమయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు ఊషన్న, అజహర్, కుమార్, రమేష్, భాస్కర్, వెంకటయ్య, రఫీ, రాజేందర్, పాండు, సూర్యం, చంద్రయ్య, రవీందర్, అశోక్, జేమ్లా నాయక్ పాల్గొన్నారు.

దరఖాస్తులు 15,653

తెలకపల్లి: గత నెల నుండి ఈ నెల 6వ తేది వరకు ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన అనే నినాదంతో గ్రామాలలో నిర్వహించిన ప్రజాపాలనలో ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. అభయహస్తం కింద గృహజ్యోతి, ఆసరా, మహాలక్ష్మి, చేయూతతో పాటు మొత్తం ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలకు ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం మండలంలో 15653 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. రేషన్‌కార్డుల కోసం 2880, నూతన రేషన్‌కార్డుల మంజూరు కోసం 4167 దరఖాస్తులు, ధరణి కోసం 15 దరఖాస్తులు, గ్రీవెన్స్ కింద 4183 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు.

11 నుంచి బ్యాడ్మింటన్ టోర్నమెంట్

అచ్చంపేట రూరల్: తెలంగాణ అమరవీరుల స్మారకార్థం పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్(షటిల్) టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని పబ్లిక్ క్లబ్ అధ్యక్షుడు దమ్మోజు సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలో టోర్నీకి సంబంధించిన కరపత్రాలు వారు విడుదల చేశారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసులు ఆర్థిక సహకారంతో టోర్నీని నిర్వహిస్తున్నామని, ప్రథమ బహుమతి రూ. 30వేలు, జ్ఞాపిక, ద్వితీయ బహుమతి రూ. 20వేలు, తృతీయ బహుమతి రూ. 10వేలు, చతుర్థ బహుమతి రూ. 5వేలు జ్ఞాపికలు అందిస్తామని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 9వ తేదీ సాయంత్రం 5గంటల వరకు వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ : 9908715147, 9059779128, 8317645336లను సంప్రదించాలని వారు కోరారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నిర్వాహకులు

తైక్వాండో జిల్లా అధ్యక్షుడిగా తెప్ప శ్రీను

కందనూలు: తైక్వాండో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా తెప్ప శ్రీనును ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో విద్యార్థులు తైక్వాండో ఆడేందుకు సరైన శిక్షణ అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో జర్నల్ సెక్రెటరీ మాస్టర్ రవికుమార్, ట్రెజరర్ మాస్టర్ స్వాతి, మాస్టర్ రామకృష్ణ, మాస్టర్ భాను, మాస్టర్ వెంకటస్వామి, మాస్టర్ శ్రీనివాస్, మాస్టర్ చందు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

లింగాల: మండలంలోని ఎర్రపెంట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శంకర్ లింగాల నుంచి ద్విచక్రవాహనంపై ఎర్రపెంటకు వెళ్తున్నాడు. ఎర్రపెంటకు సమీపంలో బైక్ అదుపుతప్పి శంకర్ కింద పడి తీవ్రగాయాలపాలయ్యాడు. బాధితుడిని 108 అంబులెన్సులో మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన పిన్నపురెడ్డి రాంరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

చారకొండ: మైసమ్మ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని తుర్కలపల్లిలో సార్లగట్ల మైసమ్మ దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, కాంగ్రెస్ నాయకులు మోపతయ్య, వెంకట్ గౌడ్, బాల్‌రాం గౌడ్, వెంకటయ్య యాదవ్, మహేందర్, దశరథం, నాయకులు ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మైసమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



మైసమ్మ ఆలయంలో భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ దేవతను ఆదివారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎండోమెంట్ అధికారి రంగారావు ఎమ్మెల్యేను పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు ఉన్నారు.

భక్తుల రద్దీ

వానాకాలం పంటలతోపాటు యాసంగిలో రైతులు ముందుగా సాగుచేసిన వేరుశనగ, మినుము పంటలు చేతికి అందడంతో మైసమ్మ దేవతకు దర్శించుకునేందుకు రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గద్వాల పెబ్బేరు, వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ ప్రాంతాల నుంచి ప్రైవేటు వాహనాలలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

కల్వకుర్తిరూరల్: మాడుగుల మండలం అవురుపల్లిలో శనివారం రాత్రి సర్దార్‌పాపన్న గౌడ్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. దళిత బహుజనుల ఆత్మగౌరవం దెబ్బకొట్టేలా వ్యవహరిస్తే సహించబోమని గౌడ సంఘం నాయకులు హెచ్చరించారు. ధర్నాలో రుకుల్‌గౌడ్, విజయ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, వెంకటయ్య గౌడ్, దామోదర్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, పాండుగౌడ్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మట్ట వెంకటయ్యగౌడ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తిర్మన్‌దాస్ నాగరాజుగౌడు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అవురుపల్లిలో పాపన్న విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని చర్యలు తీసుకోవాలని కోరారు.

చారకొండ: పాపన్న విగ్రహన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని మండల కేంద్రంతో పాటు మండలంలోని జూపల్లి, గోకారంలో గౌడ సంఘం నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గౌడ సంఘం నాయకులు గుర్వయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, దశరథం గౌడ్, కొండల్ గౌడ్, విక్రమ్ గౌడ్‌లు మాట్లాడుతూ పాపన్న విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు. కార్యక్రమాల్లో గౌడ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో ధర్నా చేస్తున్న నాయకులు

బండలాగుడు పోటీలకు ఏర్పాట్లు



తాడూరు: మండల కేంద్రంలో ఈ నెల 13న నిర్వహించే బండలాగుడు పోటీలకు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న మైదానాన్ని చదును చేశారు. అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను దాదాపు 8 నుంచి 12 జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.80వేలు బహుమతి అందజేస్తామని తెలిపారు.

కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో మల్లికార్జున స్వామి దేవాలయ నిర్మాణానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఆదివారం స్లాబ్ నిర్మాణం చేపట్టారు. మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ స్లాబ్ నిర్మాణం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నిజాముద్దీన్, శశిరెడ్డి, సుల్తాన్, జంగయ్య గౌడ్, రవి, రామస్వామి, తిరుపతయ్య, భాస్కర్, శివ తదితరులు పాల్గొన్నారు.

12న అభినందన సభ

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్‌లో ఈ నెల 12 అభినందన సభ నిర్వహిస్తునట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం బాల్‌నర్సింహ తెలిపారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కొత్తగూడెం శాసన సభ్యులు కూనమనేని సాంబశివరావు, మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి, అచ్చంపేట శాసన సభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణలను సన్మానిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వార్ల వెంకటయ్య, పి నర్సింహ, చంద్రమౌళి, ఆర్ ఇందిరమ్మ, ఫయాజ్, మండలకార్యదర్శి కృష్ణాజీ, వెంకటయ్య, కుతుబుద్దీన్, తుమ్మల శివుడు, పి కిరణ్, రవిందర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సంతబజారు స్థల మార్పు

కొల్లాపూర్: కొన్నేళ్ల నుంచి ఎన్టీఆర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సంత సాగుతోంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. సంతను పాత బజారుకే తరలించాలని ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావును స్థానికులు కోరారు. మంత్రి స్పందించి సంతను మళ్లీ పాతబజారులోకి మార్చాలని మున్సిపల్ కమిషనర్ రాజయ్యను ఆదేశించారు. దీంతో ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నుంచి పాతబస్టాండ్ వరకు సంత కొనసాగింది. సంతబజారు మార్పుపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

